



రాత్రి 12 గంటలు కావస్తోంది. శేఖర్ గాంధీభవన్‌లో నాటకం చూసి ఇంటికి బయల్దేరాడు. ఎక్కడా ఏమీ చప్పుడు లేదు. అంతా నిర్మానుష్యంగా వుంది. చలికాలం కనుక ఎవరు బయటకు రావడానికి సాహసించినట్లు లేదు. మలుపు తిరిగి కొంత దూరం నడిచేసరికి ఎవరో స్త్రీ తనకంటే ముందు నడుస్తున్నట్టు గమనించాడు.

వెంటనే శేఖర్ అనేక విధాలుగా ఆలోచించసాగాడు. అనేక ప్రశ్నలు అతణ్ణి కలవరపెట్టాయి. 'ఎవరీమె? ఇంత రాత్రి రోడ్డుమీద ఒంటరిగా ఏమిటీ సంచారం?" శేఖర్‌కు ఆ స్త్రీ ప్రవర్తన మీద చాలా అనుమానం కలిగింది ఆమెను వెంబడించి ఎక్కడికి వెళ్తుందో చూడాలనుకున్నాడు. కాని అంతరాత్మ 'ఇది మంచిపనికాదు' అని ఉద్బోధించింది. కాని ఆమెను వెంబడించాలనే కోరిక అతనికి తెలీకుండానే బలపడింది. అకస్మాత్తుగా ఆ స్త్రీ ఎలా వుంటుందో చూడాలనే కోరిక కూడ కలిగింది.

శేఖర్ బ్రహ్మచారి. స్వేచ్ఛాజీవి. తన గదికి ఎప్పుడైనా వెళ్ళవచ్చు. 'ఎక్కడకి వెళ్ళావు?' అని అడిగేవారు ఎవరూ లేరు అతనికి. అందుకని ఎంత కష్టమైనా ఆమెను గురించి పూర్తిగా తెలుసుకోవాలనుకున్నాడు.

ఒక పరాయి మగవాడు తనను వెంబ డిస్తున్నాడని గమనించినట్లుంది, ఆవిడ నడక వేగం పెంచింది.

శేఖర్‌కు- ఇది గమనించి ఇంకా ఉత్సాహం పెరిగింది. ధైర్యంకూడా హెచ్చయింది. చుట్టుపక్కల కూడ ఎవరూ లేరు.

పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ నడక వేగం పెంచి ఆమెను దాటి కొంత దూరం వెళ్ళాడు

వెనక్కు తిరిగాడు, ఆమెను చూద్దామని. ఆమె అకస్మాత్తుగా ఆగింది. కొంచెం తటపటాయించి మళ్ళీ ముందుకు నడిచింది.

శేఖర్ చూశాడు. ఆమె చాలా అందంగా వుంది. ఆమె ముఖంలో ఆందోళన, భయం వున్నట్లు గమనించాడు.

'ఆహా! ఎంత అందగత్తె ఈమె నా భార్య అయితే ఎంత బావుండును' ఆశ చిందులువేసి పరుగులు తీసింది. మళ్ళీ వెంటనే 'ఛీ! ఒక బజారు స్త్రీని పెళ్ళిచేసుకోవడమా!' అంతరాత్మ ఆవేశంగా గద్దించింది.

ఈ అంతర్యుద్ధంతో శేఖర్ కొంచెం సేపు ఊపిరిసలపనట్లు భావించాడు. ఇంతలో ఆ సుందరి శేఖర్‌ను దాటి సెలయేరు ప్రవాహంలా కదిలిపోయింది.

ఎదురుగా ఒక పోలీస్ కానిస్టేబిల్ వస్తున్నాడు. ఆమెను చూసి క్షణం ఆగాడు. శేఖర్‌ను చూసి మళ్ళా ఊరుకున్నాడు. శేఖర్‌కు దగ్గరగావస్తూ "పెళ్ళయిన కొత్తలో నాకు కూడా పెళ్ళాం పక్కన నడవాలంటే మహా చెడ్డసిగ్గేసేది" అని పళ్ళికిలించి వెళ్ళిపోయాడు.

ఇంతలో ఆ సుందరి, లకడీకాపూల్ చౌరాస్తా ఎడమచేతి పక్కనవున్న సందులో ప్రవేశించింది. పట్టువదలని విక్రమార్కుడిలా శేఖర్ కూడా వేగాన్ని పెంచి సందులోకి తిరిగాడు.

కొంతదూరం వెళ్ళిన తర్వాత ఓ ఇంటిముందు నిలబడి, వేసివున్న తలుపును కొద్దిగా నెట్టింది. తలుపు తెరుచుకుంది. ఆమె లోనికి వెళ్ళింది. తలుపు మూసింది.

'ఇప్పుడేం చేయాలి?' శేఖర్ తనను తాను ప్రశ్నించుకున్నాడు. అప్పుడు అతను తలుపుదగ్గర బయట నిలబడి వున్నాడు. ఏదో మూలుగు సన్నగా ఇంట్లోంచి అతనికి వినబడుతోంది. ఏమీ అర్థంకావడం లేదు. సమస్య మరీ జటిలమైపోతోంది.

ఏం చేయడానికి శేఖర్‌కు తోచడం లేదు. ఇంతలో తలుపు భళ్ళున తెరుచుకుంది. శేఖర్ గుండె దడదడమంటూ విపరీతంగా కొట్టుకుంది. చలిలో కూడా అతనికి చెమటపడ్తోంది. ఆమె బయటకొచ్చి "ఒకసారి లోపలికి వస్తారా!" అని అడిగింది. ఇదే పగలు అయితే ఫరవాలేదుగాని రాత్రయిపోయింది. అన

క్షవరంగా ఈ వ్యవహారంలో తల దూర్చాను అని మధనపడసాగాడు.

"ఏమిటీ ఆలోచిస్తున్నారు. ఒక నిమిషం లోనికి రండి," ఎంతో మధురంగా వుంది ఆ కంఠం.

ఇక తప్పనిసరి అయింది. శేఖర్ లోనికి వెళ్ళాడు. అది ఒక చిన్నగది. ఒకే ఒక మంచంమీద ఓ ముసలాయన పడుకుని వున్నాడు. ఆఖరి క్షణాల్లో వున్నట్లున్నాడు.

"నాన్నగారూ! డాక్టరుగారు రేపు ఉదయం వచ్చి చూస్తానన్నారు. ప్రస్తుతానికి వీరిని మిమ్మల్ని చూడటానికి పంపించారు." అని లేపబడుతూ అంది.

'తండ్రి ధైర్యం కోల్పోకుండా వుండటానికి తనను డాక్టరు పంపాడంటూ అబద్ధం ఆడుతోంది.' అని మనస్సులో అనుకున్నాడు శేఖర్

కొన్ని క్షణాలకు ఆ ముసలాయన ఎంతో నీరసంగా శేఖర్‌వంక చూసి దగ్గరకు రమ్మని సైగచేశాడు. తప్పనిసరిఅయి, శేఖర్ వెళ్ళి మంచంమీద ఓ ప్రక్కన కూర్చున్నాడు.

అప్పుడప్పుడూ కళ్ళు మూసుకుంటూ ఆగిఆగి మాట్లాడుతున్నాడు ఆయన.

"చూడు బాబూ, ఇంకా ఎంతోసేపు బ్రతకన్నేను మీ రెవరో సరిగా నాకు తెలియదు కాని నా ఆఖరి క్షణాల్లో మీరు నా సమీపంలో వున్నారు. బాబూ... నా ఒక్కగా నొక్క కూతురు చాల మంచిది. గుణవంతురాలు. స్వశక్తిమీద కష్టపడి చదివి బి.కామ్ వరకు చదివింది.

మాకు ఇక్కడ ఎవరూ లేరు మేము కలకత్తానుండి ఉద్యోగరీత్యా ఇక్కడకు సంవత్సరం క్రిందట వచ్చాం కొన్ని దురదృష్టకరమైన పరిస్థితుల్లో

"నాకు ఇక్కడకు రాగానే ఉద్యోగం ఊడింది తర్వాత నేను జబ్బుపడ్డాను. నా కూతురు అప్పట్నించీ ఒక తల్లిలా, ఒక దేవతలా నాకు సేవచేస్తూ ప్రయివేట్లు చెప్పుకుంటూ ఇంటిని నడుపుతోంది కాని నా కూతుర్ని ఒక యింటిదాన్ని చేసి అంద్రిగా నా బాధ్యత నెరవేర్చలేకపోయాననే బాధ నన్ను దహించివేస్తోంది" గొంతులో ఏదో అడ్డంపడుతున్నట్లు ఆయన ఇక ఆ తర్వాత మాట్లాడలేకపోతున్నాడు. మళ్ళీ చాలాసేపటికి ఇలా అన్నాడాయన

"చూడు బాబూ, నా కూతుర్ని నీ చేతుల్లో పెడ్తున్నాను. దాన్ని నీట ముంచినా, పాలముంచినా నీదే భారం." ఆయన కండ్లవెంట నీరు ధారగా కారిపోతోంది.

శేఖర్‌కు అంతా అయోమయంగా ఉంది. ఈ జరిగేదంతా కలో, నిజమో తెలియడంలేదు.

ఆమె శేఖరకు దగ్గరగా వచ్చింది. "చూడండి, మా నాన్నగారి మాటలు విని మీరు బాధపడవద్దు. నన్ను క్షమిం

చండి. మీరు నామీద దురభిప్రాయంతో నన్ను వెంబడిస్తున్నారు కనుక అసలు సంగతి మీకు తెలియాలని మిమ్మల్ని లోపలికి రమ్మన్నాను ఇక మీరు వెళ్ళవచ్చు. మీకు కలిగిన ఈ ఇబ్బందికి నన్ను మన్నించండి," ఎంతో గద్గద స్వరంతో అంది.

శేఖర్ కు ఎంతో సిగ్గనిపించింది. మనస్సు ఎందుకో బాధపడ్తోంది. ఆమె వంక ఒకసారి సూటిగా చూశాడు. 'ఎంత చక్కని ప్రతిమ' అనుకున్నాడు మనసులో ఆమెను తనదానిని చేసుకోవాలనే ఆరాటం మనస్సులో క్షణక్షణం అధికం కాజొచ్చింది.

"చూడండి మేడమ్! నా యీ ప్రవర్తనకు నేను సిగ్గుపడుతున్నాను. నా పేరు శేఖర్. ఇక్కడే, హైదరాబాదులోనే L I C.లో అసిస్టెంట్ గా పని చేస్తున్నాను. ఈ జరిగిందంతా చూస్తూ వుంటే దేవుడే మనల్ని ఇలాగ కలిపాడేమో అని అనిపిస్తోంది మీరు అంగీకరిస్తే మిమ్మల్ని పెళ్ళిచేసుకుందామనుకుంటున్నాను," అన్నాడు శేఖర్ తడబడుతూ.

ఆమె శేఖర్ వంక విచిత్రంగా చూసింది. ఇద్దరూ ముసలాయనవంక చూశారు ఆయన కళ్ళు తేలవేశాడు. వెర్రిచూపులు చూస్తున్నాడు ఇద్దరూ కంగారుగా ఆయనకు దగ్గరగా మంచం మీద కూర్చున్నారు

ఆయన ఎంతో కష్టంమీద కూతురి చేతిని తీసికొని శేఖర్ చేతిలో పెట్టి ఏదో చెప్పబోయి అలానే కొన్ని క్షణాల్లో ప్రాణాలు వదిలాడు

"నాన్నా!" అని బిగ్గరగా అరచి విపరీతంగా ఏడవసాగింది శేఖర్ ఆమెను లేవనెత్తి ఓదార్చడానికి ప్రయత్నం చేశాడు. "నాన్నా! ఒంటరిదాన్ని చేసిపోయావా! నా కెవరు దిక్కు" అని వెక్కి వెక్కి ఏడుస్తోంది

"చూడండి! మీరు దుఃఖించకండి. మీకు అండగా జీవితాంతం నేను వుంటాను. మిమ్మల్ని నాదానిగా చేసుకుంటాను ఇదే నా ప్రమాణం," అని ఆమె చెయ్యి పట్టుకున్నాడు శేఖర్

ఎంతో కష్టంమీద దుఃఖాన్ని దిగమ్రింగి "ఏమండీ, భగవంతుణ్ని నేను చూడలేదుగాని, మిమ్మల్ని చూశాక సాక్షాత్తూ మీరే భగవంతుడు అనే నమ్మకం కలుగుతోంది. నా జన్మంతా మీకు దాసిలా మీ కాళ్ళదగ్గర పడివుంటాను" అని అతని కాళ్ళను పట్టుకుంది ఆనంద బాష్పాలు అతని కాళ్ళను తడిపేశాయి

శేఖర్ ఆమెను పైకి లేవనెత్తి కళ్ళు తుడిచాడు ఆ సమయంలో కూడా దూరంగా ఎక్కడో చర్చిగంటలు వినబడ్తున్నాయి

———